పరీక్షలను సజావుగా జరిపించాలి

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఐఈవో రఘురాజ్

కోటగిరి, మార్చి 1 : ఇంటర్మీడియెట్ పరీక్షలను సజావుగా జరిగేలా చూడాలని డీఐఈవో రఘురాజ్ అన్నారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌లకు పాల్పడకుండా ఇన్విజిలేటర్లు కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేలా చూడాలి

మాట్లాడుతున్న డీఆర్డీఏ డీపీఎం ముత్యాల మారుతి

సారంగాపూర్, మార్చి 1 : డ్వాక్రా సంఘాల మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించేలా చూడాలని డీఆర్డీఏ డీపీఎం ముత్యాల మారుతి అన్నారు. రూరల్ మండల ఐకేపీ కార్యాలయంలో మోపాల్, నిజామాబాద్ మండలాలకు చెందిన వీవోఏలకు రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన 'లక్‌పతి దీదీ' శిక్షణ కార్యక్రమానికి శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రూప్‌లో ఉన్న ప్రతి సభ్యులు నెలకు రూ.10 వేల ఆదాయం సంపాదించేందేలా జీవనోపాదులను గుర్తించి ప్రణాళికను రూపొందించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు రవికుమార్, మహేశ్‌కుమార్, మోహన్, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి డోలారోహణం

డోలారోహణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

సారంగాపూర్, మార్చి 1 : రూరల్ మండలంలోని మల్కాపూర్(ఏ)లో ఉన్న శ్రీలక్ష్మీ అనంతపద్మనాభ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి డోలారోహణం నిర్వహించారు. కార్యక్రమానికి మల్కాపూర్(ఏ), లక్ష్మాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. శనివారం సాయంత్రం 4 గంటలకు రథోత్సవం ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటుచేయాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, సీపీ, అధికారులు

వీసీలో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి

కంఠేశ్వర్, మార్చి 1 : రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు అర్హులకు అందేలా కృషిచేయాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతి కుమారి సూచించారు. అర్హులు మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాల లబ్ధి పొందేలా ఎంపీడీవో, మున్సిపల్ వార్డు కార్యాలయాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలను నెలకొల్పాలని ఆదేశించారు. డీజీపీ రవిగుప్తాతో కలిసి కలెక్టర్లు, సీపీలు, అధికారులతో శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. ప్రజాపాలన కేంద్రాలను దరఖాస్తు చేసుకోని వారు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఇంటర్‌నెట్ సదుపాయం ఉన్న కంప్యూటర్‌తో పాటు డాటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించాలని సూచించారు. వచ్చే సోమవారం నాటికి అన్ని ప్రాంతాల్లో సేవా కేంద్రాలు అందుబాటులోకి రావాలని స్పష్టమైన గడువు విధించారు.

టెన్త్, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

ప్రస్తుతం కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలతో పాటు త్వరలో ప్రారంభం కానున్న పదోతరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వ సీఎస్ శాంతికుమారి సూచించారు. కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని కమిషనర్లు, ఎస్పీలకు సూచించారు. వీసీలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ట్రైనీ ఐపీఎస్ చైతన్య, జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్, డీఈవో దుర్గాప్రసాద్, ఆర్టీసీ ఎండీ జాన్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్, డీఎస్‌వో చంద్రప్రకాశ్ అధికారులు పాల్గొన్నారు.

వారంరోజుల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి

- లేకపోతే చర్యలు తప్పవు
- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- నాందేవ్‌వాడలోని గిరిజన కళాశాల వసతిగృహం తనిఖీ

భోజనాన్ని పరిశీలిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

వసతిగృహంలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్డి, పరిసరాల్లో నెలకొన్న అపరిశుభ్రత

వినాయక్‌నగర్, మార్చి 1 : జిల్లాకేంద్రంలోని నాందేవ్‌వాడలో ఉన్న గిరిజన కళాశాల వసతిగృహాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహ నిర్వహణ అస్తవస్తంగా ఉండడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. వసతిగృహంలో 120 మంది విద్యార్థులకు ఒకే చిన్న వాటర్ ట్యాంక్ ఉన్నదని, నీళ్లు రాక ఇబ్బందులు పడుతున్నట్లు విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. బాత్‌రూంలో దుర్వాసన రావడం, నీరు లేకపోవడం, మధ్యాహ్న భోజనంలో రోజు కూరతో తింటున్నామని విద్యార్థులు వివరించారు. ఎమ్మెల్యే వెంటనే గిరిజన వెల్ఫేర్ అధికారితో ఫోన్‌లో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, వారం రోజుల్లో విద్యార్థులకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని.. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రెండు రోజుల జైలుశిక్ష

వినాయక్‌నగర్, మార్చి 1 : డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఒకరికి కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించింది. నగరంలో నిజామాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఇటీవల చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 8 మందిపై కేసులు నమోదు చేశారు. వారికి ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ కౌన్సెలింగ్ నిర్వహించారు. శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా.. పూలాంగ్ ప్రాంతానికి చెందిన పి.యాదగిరికి రెండు రోజుల జైలు శిక్ష, ఏడుగురు వాహనదారులకు రూ.7,800 జరిమానా విధిస్తూ నిజామాబాద్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సయ్యద్ ఖదీర్ తీర్పు వెల్లడించారని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ వెల్లడించారు.

హోంగార్డ్ బి.సాయన్ రావు (హెచ్‌జీ-554) శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఆయనను సీపీ కల్మేశ్వర్ శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ప్రజలకు సేవలందించి, ఎలాంటి రిమార్క్ లేకుండా ఉద్యోగ విరమణ చేయడం గొప్పవిషయమని అన్నారు.
వినాయక్‌నగర్, మార్చి 1

వికసిత్ భారత్ విద్యారంగంపై సెమినార్

మాట్లాడుతున్న ఏబీఆర్ఎస్ జాతీయ ఉపాధ్యక్షురాలు డాక్టర్ కల్పనా ప్రవీణ్ పాండే

డిచ్‌పల్లి, మార్చి 1 : టీయూలో అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ ఆధ్వర్యంలో 'వికసిత్ భారత్ - విద్యారంగం పాత్ర' అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఏబీఆర్ఎస్ జాతీయ ఉపాధ్యక్షురాలు డాక్టర్ కల్పనా ప్రవీణ్ పాండే హాజరై మాట్లాడారు. అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే విశ్వవిద్యాలయాలు కీలకపాత్ర పోషించాల్సిన అవసరముందన్నారు. అధ్యాపకులు దేశ సంబంధిత పరిశోధనలు, ప్రయోగాలు చేసి 2047వ సంవత్సరం వరకు భారతదేశం అభివృద్ధి దేశంగా ఎదగడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గౌరవ అతిథిగా హాజరైన ఏబీఆర్ఎస్ఎం ఆల్ ఇండియా జాయింట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ గుంత లక్ష్మణ్ మాట్లాడుతూ.. దేశీయ టెక్నాలజీ అభివృద్ధి చేసి, భారతదేశ ఆత్మనిర్భరతకు పాటుపడాలని అన్నారు. దేశం సైన్స్ అండ్ టెక్నాలజీలో ప్రగతిని సాధిస్తున్నదని, దేశ రక్షణలో ముందంజలో ఉందని తెలిపారు. ఇంగ్లిష్ అండ్ పారిస్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ సహ ఆచార్యులు రాజారాం పలు అంశాలపై అవగాహన కలిపించారు. సెమినార్ సమన్వయ కర్తలుగా డాక్టర్ వాసం చంద్రశేఖర్, డాక్టర్ ఎం.సత్యనారాయణ, డాక్టర్ శిరీష బోయపాటి వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆరతి, ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ యాదయ్య, టీయూ సీనియర్ ఆచార్యుడు ఆంజనేయులు, డీన్ రాంబాబు, సంపత్‌కుమార్, రవీందర్‌రెడ్డి, నాగరాజు, ప్రసన్న శీలా, వీరభద్రం, కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

కందకుర్తి వద్ద త్రివేణి సంగమ క్షేత్రంలో భక్తులు శుక్రవారం పూజలు నిర్వహించారు. నదిలోని పురాతన శివాలయాన్ని దర్శించుకుని మొక్కలు చెల్లించుకున్నారు. – రెంజల్, మార్చి 1

సంక్షిప్తంగా..

- **తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి** - చందూర్, మార్చి 1 : వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఎంపీపీ తారాచంద్ అన్నారు. మండలంలోని చందూర్, లక్ష్మాపూర్, కారేగాం, మేడ్‌పల్లి గ్రామాల కార్యదర్శులకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన కల్పించారు.
- **ప్రభుత్వ పథకాలపై అవగాహన** - జక్రాన్‌పల్లి, మార్చి 1 : మండలంలోని కేశ్‌పల్లి, సికింద్రాపూర్‌లో తెలంగాణ సాంస్కృతిక కళాబృందం సారథి, డీపీఆర్వో పర్యవేక్షణలో ప్రభుత్వ పథకాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. పథకాలతోపాటు పరిసరాల శుభ్రతపై కళాకారులు ఆటపాటల రూపంలో అవగాహన కల్పించారు.
- **నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు**- ఇందల్వాయి, మార్చి 1 : మండలంలోని తిర్మన్‌పల్లిలో శివాలయ విగ్రహ ప్రతిష్ఠాపన్సోవాలు నేడు (శనివారం) నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ, వీడీసీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలు ఈనెల 6వ తేదీ వరకు కొనసాగుతాయని, భక్తులు తరలిరావాలని కోరారు.
- **మండల సమావేశం వాయిదా** - వర్ని, మార్చి 1 : మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. ఎంపీపీ మేక శ్రీలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించాల్సిన సమావేశానికి కేవలం ఒక ఎంపీటీసీ సభ్యుడు మాత్రమే హాజరు కావడంతో వాయిదా వేసినట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్ తెలిపారు.
- **పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ** - ధర్పల్లి, మార్చి 1 : మండలంలోని సీతాయిపేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో బాలకృష్ణ శుక్రవారం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, సమయపాలన పాటించాలని సూచించారు. అనంతరం ఉపాధి హామీ పనులను పరిశీలించారు.
- **కొనసాగుతున్న క్రికెట్ టోర్నీ** –డిచ్‌పల్లి, మార్చి 1 : టీయూలో ఐదో రోజు శుక్రవారం ఇంటర్ కాలేజీ క్రికెట్ మెన్ టోర్నమెంట్ కొనసాగింది. సెమీఫైనల్ మ్యాచ్.. వర్సిటీ పీజీ టీమ్‌తో గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల –కామారెడ్డి టీం తలపడగా.. టీయూ పీజీ టీం జీడీసీ కామారెడ్డి టీంపై గెలుపొంది ఫైనల్‌కు చేరినట్లు వర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ జి.బాలకిషన్ తెలిపారు.
- **ఉచిత వైద్య శిబిరం** - వినాయక్‌నగర్, మార్చి 1 : సంత్ రవిదాస్ జయంతిని పురస్కరించుకొని నగరంలోని ఇంద్రాపూర్ కాలనీలో బీజేపీ ఎస్సీ మోర్చా, అర్వింద్ ధర్మపురి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శ్రీ చక్ర దవాఖాన డాక్టర్ విశ్వతేజ స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.
- **నర్సరీ పరిశీలన** - ఇందల్వాయి, మార్చి 1 : మండలంలోని తిర్మన్‌పల్లి, వెంగళ్‌పాడ్ తండా, గంగారాం తండా పరిధిలోని నర్సరీలతోపాటు కంపోస్ట్ షెడ్లు, డంపింగ్ యార్డును ఎంపీడీవో అనంత్‌రావు శుక్రవారం పరిశీలించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.
- **దొరికిన మొబైల్ అప్పగింత**- బాల్కొండ, మార్చి 1: మండల కేంద్రానికి చెందిన కోటగిరి గణేశ్‌కు చెందిన మొబైల్ పడిపోగా శుక్రవారం ఉదయం అటువైపు వెళ్తున్న కానిస్టేబుల్ పవన్‌కు దొరికింది. దీనిని మానవత్వంతో వెంటనే బాధితుడికి ఫోన్ చేసి అప్పగించినట్లు ఏఎస్సై శంకర్ తెలిపారు.
- **గురుకుల లెక్చరర్ పోస్టుకు ఎంపిక**- మాక్లూర్, మార్చి1: మండలం కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రత్యేకాధికారిగా విధులు నిర్వహిస్తున్న ప్రగతి గురుకుల లెక్చరర్ పోస్టుకు ఎంపికైంది. ఉపాధ్యాయులు ఆమెను శుక్రవారం అభినందించారు.
- **సీసీ రోడ్డు పనులు ప్రారంభం** - మోర్తాడ్, మార్చి1: మోర్తాడ్‌లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.35లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను ఎంపీడీవో తిరుమల ప్రారంభించారు. పీఆర్ ఏఈ విక్రమ్, కాంగ్రెస్ పార్టీ మోర్తాడ్ మండల అధ్యక్షుడు ముత్యాల రాములు, అశోక్, మహిపాల్, గోపి, నసీర్ తదితరులు పాల్గొన్నారు.
- మాక్లూర్, మార్చి 1: మాదాపూర్‌లో సీసీ రోడ్డు పనులకు శుక్రవారం అధికారులు భూమిపూజ నిర్వహించారు. ఈ పనులకు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి రూ.4 లక్షల నిధులు మంజూరు చేశారు. ఎంపీడీవో క్రాంతి, కార్యదర్శి సురేశ్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, నాయకులు పాల్గొన్నారు.
- **సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం**- కమ్మర్‌పల్లి/వేల్పూర్, మార్చి1: రూ.500కు గ్యాస్ సిలిండర్, గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ అమలును ప్రారంభించిన సందర్భంగా కమ్మర్‌పల్లి ఐకేపీ కార్యాలయం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు, కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఆపార్టీ మండల అధ్యక్షుడు సంకట రవి, నాయకులు పాల్గొన్నారు. వేల్పూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ మాజీ విప్ ఈరవత్రి అనిల్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.
- **నివాళి**- శక్కర్‌నగర్, మార్చి 1: ఎస్సీ వర్గీకరణ పోరాటంలో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు శుక్రవారం టీఎమ్మార్పీఎస్ నాయకులు ఆజాంగంజ్‌లోని దండోరా కమ్యూనిటీ హాలులో నివాళులర్పించారు. టీఎమ్మార్పీఎస్ నాయకులు మందుగుల విద్యాసాగర్, వాగ్మారే నాగూరావు, ఈరపురం పోశెట్టి, బెల్లిడిగ సుధాకర్, మహేందర్ పాల్గొన్నారు. బోధన్ అంబేద్కర్ చౌరస్తాలో మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరులకు నివాళులర్పించారు. ఆ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు డల్లా సురేశ్, ఎమ్మార్పీఎస్ బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మిగారి భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు, పట్టణ అధ్యక్షుడు తాడెం అబ్బయ్య, నాయకులు పాల్గొన్నారు.
- **పాఠశాలకు వంటసామగ్రి** - భీమ్‌గల్, మార్చి 1: మెండోరా ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి అవసరమైన వంటసామగ్రిని వీడీసీ అధ్యక్షుడు గాజరి గంగారెడ్డి, ఉపాధ్యక్షుడు ఏలిశాల గంగాధర్, క్యాషియర్ తక్కూరి సాయిరెడ్డి తదితరులు శుక్రవారం అందజేశారు. హెచ్ఎం ముత్తెన్న, ఉపాధ్యాయులు వీడీసీ సభ్యులు సత్యనారాయణ, రాజేశ్వర్ పాల్గొన్నారు.
- **కేసును ఎత్తివేయాలి**- మాక్లూర్, మార్చి 1: సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అశోక్ తదితరులపై మోపిన పూసనపల్లి కుట్ర కేసును ఎత్తివేయాలని ఏఐకేఎంఎస్ ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్ డిమాండ్ చేశారు. మానిక్ భండార్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.
- **ఎన్నిక**-ఆర్మూర్‌టౌన్, మార్చి1: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఐఎన్‌టీయూసీ రాష్ట్ర మహాసభలు గతనెల 27న యాదగిరిగుట్టలో నిర్వహించారు. పట్టణంలోని డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయం సబ్ యూనిట్ అధికారి సాయి యూనియన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్నిక కావడంతో డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ శుక్రవారం కార్యాలయంలో సన్మానించారు.
- **ఎన్నిక**- నందిపేట్, మార్చి 1: శాపూర్ గ్రామానికి చెందిన కొమిరె సుధాకర్ బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనను పార్టీ నాయకులు, స్థానికులు అభినందించారు.

మహిళా సంఘాల పనితీరు భేష్

నవీపేట, మార్చి1: స్థానిక మహిళా సంఘాల పనితీరు బాగుందని ట్రెయినీ ఐఏఎస్ అధికారిణి కిరణ్మయి కితాబిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆమె పర్యటించారు. మొదట ఆదర్శ పాఠశాలలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నవీపేట రైతు వేదికలో మహిళా సంఘాల ప్రతినిధులతో రెండున్నర గంటలపాటు సంఘాల ఆర్థికాభివృద్ధి వివరాలు అడిగి తెలుసున్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో సాయాగౌడ్, ఎంపీడీవో నాగనాథ్, డీపీఎం (బ్యాంక్ లింకేజీ) నీలిమా, ఏపీఎం భూమేశ్వర్‌గౌడ్, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు ఉషారాణి, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు పల్స్‌పోలియో

శక్కర్‌నగర్, మార్చి 1: ఈనెల 3న నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. బోధన్ డివిజన్‌లో ఐదేండ్లలోపు పిల్లలు 37,950 మంది ఉన్నారని పేర్కొన్నారు. డివిజన్‌లో 256 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. 4,5 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి పల్స్‌పోలియో చుక్కలు వేయాలని ఆమె సిబ్బందికి సూచించారు. పల్స్‌పోలియో కార్యక్రమంలపై అవగాహన కల్పించేందుకు గాను శనివారం ఉదయం ఏడు గంటలకు బోధన్ పట్టణంలో 'అవగాహన ర్యాలీ' నిర్వహించనున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య తెలిపారు.

విజయవంతం చేయాలి

కమ్మర్‌పల్లి/నందిపేట్, మార్చి 1: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి సుప్రియ పేర్కొన్నారు. తెలిపారు. చౌట్‌పల్లి పీహెచ్‌సీ పరిధిలోని 28 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పల్స్‌పోలియోపై నందిపేట్ వైద్యాధికారులు ప్రవీణ్, రాజ్‌కుమార్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మేరీ, సుజాత, భాస్కర్ పాల్గొన్నారు.

బోధన్ పట్టణంలో నడి ఊరు హనుమాన్ ఆలయ హనుమాన్ సమేత శివ పంచాయతన స్థిర ప్రతిష్ఠా మహోత్సవంలోభాగంగా రెండో రోజు శుక్రవారం వివిధ పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమార్చన చేశారు. భాస్కరాచార్య గణేశ్ మహరాజ్ పర్యవేక్షణలో బాసరకు చెందిన శ్రౌతి మురళీధర శర్మ, శివాలయ అర్చకులు మహేశ్ పాఠక్, రుత్విక్కు ప్రతిష్ఠా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో చెన్నైకి చెందిన ఆలయ శిల్పి నటరాజ్‌ను గ్రామాభివృద్ధి కమిటీ సన్మానించింది. కార్యక్రమాలను బోధన్ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సింగం బాగారెడ్డి యాదవ్, కోశాధికారి కోంద్ర వెంకటి, బోధన్ శివాలయ చైర్మన్ బీర్కూర్ బుజ్జి, వీడీసీ ప్రతినిధులు పూజారి లింగం, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పర్యవేక్షించారు. – బోధన్, మార్చి 1

నందిపేట్ మండలం లక్కంపల్లిలో హనుమంతుడి విగ్రహ ప్రతిష్ఠాపన కోసం మాజీ సర్పంచ్ దంపతులు లతాప్రసాద్ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. విగ్రహం ఏర్పాటు కోసం మాజీ సర్పంచ్ సొంత స్థలాన్ని అందిస్తున్నారని, విగ్రహ ప్రతిష్ఠాపన కోసం గ్రామంలో విరాళాలు సేకరించామని గ్రామపెద్దలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్, వెంకటేశ్వర్, గ్రామపెద్దలు పాల్గొన్నారు. – నందిపేట్, మార్చి 1

తాగునీటి సమస్యలు రాకుండా చూడాలి

ఏర్గట్లలో మాట్లాడుతున్న ఎంపీవో శివచరణ్

బోధన్ రూరల్/ఏర్గట్ల/భీమ్‌గల్/రెంజల్, మార్చి1: వేసవిలో గ్రామాలో తాగునీటి సమస్యలు రాకుండా ప్రణాళికలు తయారు చేయాలని బోధన్ ఎంపీడీవో వెంకటేశ్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయత్‌రాజ్ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, జీపీ కార్యదర్శులతో తాగునీటి సమస్యపై సమీక్ష నిర్వహించారు. ఎంపీవో మధుకర్, పంచాయతీ రాజ్ ఏఈ సాయిలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనిల్ పాల్గొన్నారు. ఏర్గట్ల మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శిలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈతో ఎంపీవో ఎంపీవో శివచరణ్ సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో తాగునిటి ఎద్దడి లేకుండా చూడాలని సూచించారు. ఏఈ స్వరాజ్, పంచాయతీ కార్యదర్శులు జాకీర్, రవి, భోజన్న, భార్గవ్, రవి, రాకేశ్, స్వప్న తదితరులు పాల్గొన్నారు. భీమ్‌గల్ మండలంలోని గ్రామాల్లో తాగునీటి సరఫరా, మిషన్ భగీరథ నీటి సరఫరాపై జీపీ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మిషన్ భగీరథ గ్రిడ్ సిబ్బంది, గ్రామపంపు మెకానిక్‌లతో మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షా నిర్వహించారు. ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్ పలు సూచనలు చేశారు. రెంజల్ మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మున్ని నాయక్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్యలుంటే 12వ ఆర్థిక సంఘం నిధులను వెచ్చించి తక్షణమే మరమ్మతు చేపట్టాలని సూచించారు. ఎంపీడీవో శంకర్, మండల పర్యవేక్షకుడు శ్రీనివాస్, ఎంపీవో గౌసొద్దీన్ పాల్గొన్నారు.

మూడు ఉద్యోగాలకు యువతి ఎంపిక

గుమ్మేర్ల రసన్య

శిరీషను సన్మానిస్తున్న అధికారులు

భీమ్‌గల్, మార్చి 1: చేంగల్ గ్రామానికి చెందిన గుమ్మేర్ల రసన్య మూడు ఉద్యోగాలకు అర్హత సాధించింది. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గురుకుల ఉపాధ్యాయ ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల కావడంతో దరఖాస్తు చేసుకుంది. అనంతరం వెలువడిన ఫలితాల్లో టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్ కేజీబీవీ పోస్టులకు అర్హత సాధించింది. మూడు ఉద్యోగాలు సాధించడంతో గ్రామస్తులు అభినందించారు.

రెండు ఉద్యోగాలకు జీపీ కార్యదర్శి..

మండలంలోని కొత్త తండా గ్రామపంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న టి.శిరీష గురుకుల డిగ్రీ లెక్చరర్‌గా, జూనియర్ కళాశాల లెక్చరర్‌గా రెండు ఉద్యోగాలకు ఎంపికైంది. శుక్రవారం ఆమెను ఎంపీడీవో సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీవో గంగామోహన్, ఏపీవో జి.నర్సయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం

నందిపేట్, మార్చి 1: ఉమ్మడి నందిపేట్ మండలం డొంకేశ్వర్ పీఏసీఎస్ వైస్‌చైర్మన్ రాజిరెడ్డిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. వైస్ చైర్మన్‌పై సభ్యులు అవిశ్వాస తీర్మానం కోరుతూ ఇటీవల జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేశారు. డీసీవో శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం సొసైటీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. 13 మంది సభ్యులకు గాను 9 మంది హాజరయ్యారు. మూడో వంతు కోరం ఉండడంతో అధికారులు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసానికి సానుకూలంగా 9మంది చేతులు ఎత్తడంతో అవిశ్వాసం నెగ్గిందని డీసీవో తెలిపారు. ఈ మేరకు రాజరెడ్డిని వైస్ చైర్మన్ పదవి నుంచి తొలగిస్తున్నట్లు తీర్మానం చేశారు. శనివారం నూతన వైస్‌చైర్మన్ ఎన్నిక ఉంటుందని తెలిపారు.

క్షయ రహిత గ్రామంగా ముల్లంగి(బి)

మాక్లూర్, మార్చి1: ముల్లంగి(బి) గ్రామాన్ని క్షయ వ్యాధి నిర్మూలించిన గ్రామంగా ప్రభుత్వం గుర్తించడంతో జిల్లా అధికారులు శుక్రవారం గ్రామాన్ని సందర్శించారు. క్షయ వ్యాధికి గురైన వారితో మాట్లాడారు. అనంతరం వీడీసీ సభ్యులు సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో డీపీవో తరుణ్ చక్రవర్తి, డీఎంహెచ్‌వో సుదర్శన్, ఎంపీడీవో క్రాంతి, ఎంపీవో శ్రీనివాస్, జీపీ స్పెషల్ ఆఫీసర్ ఉమమాసహేరా, వైద్య కళాశాల ప్రొఫెసర్ కిశోర్‌కుమార్, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాలకు నూనె పంపిణీ

నూనె పంపిణీ చేస్తున్న సురేశ్ ఆత్మారాం మహరాజ్

శక్కర్‌నగర్, మార్చి1: బోధన్ పట్టణ శివారులోని నర్సాపూర్ దివ్య సంజీవనీ ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ వ్యవస్థాపకుడు సురేశ్ ఆత్మారాం మహరాజ్ దీపారాధన నూనెను శుక్రవారం పంపిణీ చేశారు. సుమారు రెండేండ్లుగా ఆయన దేవాదాయశాఖ పరిధిలో లేని పలు గ్రామీణ ప్రాంతాలు, పట్టణంలోని పలు ఆలయాలకు నూనెను ప్రతి నెలా అందిస్తున్నారు. సురేశ్ మహరాజ్ అందిస్తున్న సేవలకు తోడుగా ఈ సారి బోధన్‌కు పట్టణానికి చెందిన సప్నీల్ అనే యువకుడు తనవంతుగా ఒక్కో ఆలయానికి కుంకుమ, పసుపు, హారతి కర్పూరంతోపాటు, ఒక్కో అగర్‌బత్తీ పాకెట్‌ను అందించారు.

బంగారంపై రుణాలు ఇవ్వాలని తీర్మానం

నవీపేట,మార్చి :1 బినోలా సొసైటీలో బంగారంపై రుణాలు ఇవ్వాలని, నాబార్డ్ నిధుల నుంచి ఫంక్షన్ హాల్ నిర్మించాలని సంఘ సభ్యులు తీర్మానించారు. శుక్రవారం బినోలా సొసైటీ నూతన భవనంలో చైర్మన్ మగ్గరి హన్మాండ్లు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షుడు బాబర్, డైరెక్టర్లు , సీఈవో పాల్గొన్నారు.

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా బాల్కొండ జడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం విద్యార్థులు పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు శైలజ, అర్చన, రూప, యాస్మిన్, ఫాతిమా పాల్గొన్నారు.
– బాల్కొండ, మార్చి 1

గోదావరిలో మహిళ గల్లంతు

రెంజల్,మార్చి 1: పుణ్య స్నానాలు ఆచరించేందుకు కందకుర్తి వద్ద శుక్రవారం గోదావరిలో దిగిన మహిళ గల్లంతైనట్లు కుటుంబీకులు తెలిపారు. మహిళ స్నానం చేసేందుకు నీటిలో దిగిన సమయంలో ఎగువ నుంచి బాబ్లీ ప్రాజెక్ట్ నీరు రావడంతో గల్లంతైనట్లు తెలిపారు. ఆచూకీ కోసం జాలర్లు గాలించినా ఫలితం లేకుండా పోయింది.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఎడపల్లి, మార్చి 1: మండల కేంద్రంలో శుక్రవారం రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. నిజామాబాదు రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. ఎడపల్లికి చెందిన షేక్ షాబుద్దీన్ (30) కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నయాబాదు నుంచి ఊరిలోకి వెళ్లేందుకు రైల్వేట్రాక్‌ను దాటుతున్నాడు. అదే సమయంలో వస్తున్న రైలు ఢీకొట్టింది. తీవ్ర గాయాలుకావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

దుబాయిలో రోడ్డు ప్రమాదంలో ఒకరు..

నందిపేట్, మార్చి 1: డొంకేశ్వర్ మండల కేంద్రానికి చెందిన సుధా విఠల్(53) దుబాయిలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ రెండు రోజుల క్రితం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల కథనం మేరకు.. ఉపాధి కోసం సుధా విఠల్ 20 ఏండ్లుగా దుబాయిలో పనిచేస్తున్నాడు. ఏడాది క్రితం స్వగ్రామానికి వచ్చి మళ్లీ వెళ్లాడు. గత నెల 18న రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. చికిత్స పొందుతూ రెండు రోజుల క్రితం మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.